# మరణోద్యోగం

'పోషించడానికే గాని చంపడానికి
అధికారంలేదు సామాన్యుడికి.
పోషించలేదు కాని చంపగలదు
ప్రభుత్వం. ఆహా! ప్రకృతి వైచిత్ర్యం!'

రచయిత :

## కొత్తపల్లి శ్రీరామమూర్తి, యల్.యమ్.ఇ.

మోహనరావు పెద్ద కుటుంబం లోనే పుట్టాడు. అతడు పుట్టేసరికి ఆ మంగయ్యగారియిల్లు కన్నుల పైకుంఠంగావుంది. ఆడవారు,మగవారు కలసి ఒక డజను సంతానం మంగయ్యగారికి. మోహన్‌రావు ఐదవవాడు.

మంది ఎక్కువైతే మజ్జిగపలుచనైనట్టుగా ఆపెద్ద కుటుంబాన్ని పెంచి పెద్దవారిని చేసేటప్పటికి మంగయ్యగారి ఆస్తి హారతికర్పూరంలా హరించిపోయింది. అవులను దూడలనుకూడా అమ్మి అబ్బాయిలకు చదువు చెప్పించాడు.

మోహన్‌రావు కాకినాడ, మహారాజావారి కాలేజీలో బి. ఏ. వరకు చదువుకున్నాడు. అందులో ప్రథముడుగా ఉత్తీర్ణుడైనాడు. చదువుకునే రోజుల్లోనే వివాహమైయింది. అర్ధాంగి కష్టసుఖాలకు భాగస్వామురాలైయింది.

చదువు పూర్తిఅయి వ్యవహారాలవైపు దృష్టి ప్రసరించేసరికి పెద్ద అఘాతం గోచరమైయింది. కుటుంబవ్యవహారం పిడుగుబడ్డ తాడి అని తేటతెల్లమైయింది. సంసారం మీద విరుచుకుపడింది. తండ్రి కొడుకు సంపాదన చూడకుండానే హరీ అన్నాడు. సహధర్మచారిణి బిడ్డల తల్లి అయింది.

సంసారం నిలబెట్టడానికి ఉద్యోగంతప్ప వేరే గత్యంతరం కనుపించడంలేదు ఆస్థితిలో.

కాగా పట్టా చేతపుచ్చుకొని పట్నంచేరాడు ఎక్కడేనా ఒక గుమస్తాపని సంపాదిద్దామన్న వాంఛతో.

అర్ధాంగి కమల మోహన్‌రావునువిడిచి ఉండడానికి యియ్యకొనలేదు, కలో గంజో అతనితోపాటు తాగితేనే జీవితం ధన్యమనుకుంది. అతనితోకూడా ప్రయాణమైయింది.

మోహన్‌రావు పలువిధాల చెప్పాడు. 'వెళ్ళేది కొత్తస్థలం. మనవద్ద పైకంలేదు. ఉద్యోగం వచ్చేవరకు నీవు మీ అమ్మగారియింటివద్ద వుండ'మని బోధించాడు.

శీలవతి, గుణవతి అయిన కమలకు ఆమాటలు నచ్చలేదు. ఈ పాడులోకం వట్టినే అపవాదులు వేస్తుంది. అందులో భర్త పట్నంలో బాధలుపడుతూవుంటే అమ్మగారియింటివద్ద వుండటం లేనిపోని అనుమానాలు కల్పిస్తారని భయపడింది. తాను పిల్లలతల్లి అయినా, భర్త వద్దనిచెప్పినా అతనితోడిదే లోకం అని దరిద్రదేవతను ఆరాధించడానికైనా వెనుతీయకుండా భర్తతో చెన్నపట్నం చేరింది.

మదరాసులో ఒక చిన్నయిల్లు తీసుకొని కాపరంపెట్టాడు మోహన్‌రావు.

అతడు నిత్యం ఉదయాన్నే లేచి పట్టా చేతపట్టుకొని ఆఫీసులన్నీ గాలించాడు. ఎక్కడకువెళ్ళినా 'నో వేకెన్సీ' అన్న బోర్డులు అతనికి స్వాగతం యిచ్చేవి.

ఈవిధంగా సున్నపుపిడిత ఎదురవడం చూస్తే అతనికి భరింపరాని

బాధకలిగేది కాని కమల ఆదరణ అతనికి కొంత సేద తీరుస్తోవుండేది.

సిఫారసులు లేకండా ఉద్యోగాలు దొరకవని విశదమైయింది. వాడికాళ్లు వీడికాళ్లు అఖరకు-వసుదేవుడు గాడిదకాళ్లు పట్టుకున్నట్టు-అడ్డమైనవాళ్ళకాళ్ళు పట్టుకొన్నాడు. అన్నీ నిష్ఫలమైనాయి.

ఔనన్న కుటుంబంలో పుట్టి అక్షయపాత్ర పట్టడంకన్నా ఆత్మహత్య మంచిదనుకున్నాడు. అతనికి జగమంతా శూన్యంగావుంది.

నిరాశతో నలుదిక్కులు పరికించాడు. ఎక్కడా దారి కనుపించడంలేదు. అబ్బాయి మొలలోని మామిడిపిందెలు అమ్ముకునే స్థితికి వచ్చింది.

పోనీ ఏపత్రికకైనా రెండు వ్యాసాలు వ్రాస్తే నాలుగు డబ్బులైనా దొరుకుతాయనుకుని పిల్లవానికి బారసాలనాడు అమ్మమ్మగారు పెట్టిన ఉంగరం అమ్మి కాగితం, సిరా కొని కథ వ్రాశాడు. అది ఒకపత్రికాధిపతివద్దకు పట్టుకువెళ్లాడు.

ఆపత్రికాధిపతి అతని విషాదగాధను విని ఒక వేడి కన్నీటిబొట్టు రాల్చి ముష్టిలో ముష్టి వీరముష్టి అని నాయనా మాబోటి దరిద్రులు ఏమి సాయం చేయగలరు నాకు చేతనైన సాయం చేస్తాను నా మేగజైనులో ఆకథ వేసి కాపీలు ఒకపది యిస్తాను అవి ఎవరికైనా అమ్ముకుని ఆడబ్బు తీసుకో మన్నాడు సానుభూతి వ్యక్తంచేస్తూ.

అసలులేని బావకన్నా గుడ్డిబావ మేలనుకున్నాడు ఆదరిద్రనారాయణుడు. ఆకాపీలు పట్టుకు ఎక్కేగుమ్మం దిగేగుమ్మం. న్యాయమూర్తులు తెలుగువారు ఉన్నారు చాలామందని ఆశతో ఆధర్మమూర్తుల దర్శనానికి పోయాడు. వారు తెలుగు పత్రికలు చూడమని విసిరికొట్టారు. ఎక్కడకేనాపోయి అడుక్కు తినకూడదా అని హేయంగా మాటాడారు ఆ ధర్మమూర్తులు. శ్రీమంతులు తలచుకుంటే దేనికి లోటువుండదు? ప్యూనుని పిలవకండానే బయటకుపోతే మంచిది ఉన్న మర్యాదా అయినా దక్కుతుందనుకున్నాడు. మానధనులకు పరాభవంకన్నా చావుమేలు. నిరుద్యోగంచేత అన్నివిధాల కృంగిపోయాడు.

ఇంతటిలోకి యుద్ధమేఘాలు గర్జించాయి. స్వాతివానకు ముత్యపుచిప్పలు ఎదురుచూస్తున్నట్టు ఏ ఉద్యోగానికైనా సరేనని వేచియున్న మోహనరావు హృదయం ఉర్రూతలూగింది.

కాని ఇనుపగజ్జెలతల్లి ప్రియపుత్రులకు ఎక్కడకెళ్ళినా సున్నపుపిడత తప్పదు. యుద్ధంలో చేరడానికి అప్లికేషను పెట్టాడు. యింటర్వ్యూ కార్డువచ్చింది.

బెంగతో చిక్కి శల్యమైయున్న మోహనరావు లేనిబలం తెచ్చుకుని హాజరైనాడు. అతనిని డాక్టరుపరీక్షకు పంపారు. బలహీనుడన్న నెపంమీద అతన్ని యుద్ధంలో పనిచేయడానికి పనికిరాడని వ్రాసేశాడు డాక్టరు.

దేవుడా అని యింటికివచ్చాడు. ఉన్న ప్రాణాలుకూడా పోయాయి భార్యా బిడ్డలను చూస్తే అతని హృదయం తరుక్కుపోతోంది. తనను కట్టుకుని కమల నలిగిపోతోంది కదా అనుకుని అతడు కుమిలిపోతున్నాడు.

ఇంతట్లోకి సర్వీసు కమీషను వారు గుమస్తాఉద్యోగాలకు అప్లికేషనులు పెట్టుకోవలసిందని ప్రచురించాడు.

ఎండిన చేనుమీదకు నీళ్లు వచ్చినట్టు అయింది. కాని పదిరూపాయలు చెల్లిస్తేనేగాని అతని అప్లికేషను రిజిష్టరేకాదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఏమిచేయడానికి తోచలేదు అప్పు అడిగితే ఎవరు యిస్తారు? కమల వంటిమీదవున్న వెయ్యిరూపాయల నగలు వెళ్ళిపోయాయి- ముక్కుపుడకతోసహా. పోగా మిగిలింది ఒక మంగళసూత్రం.

ఆమెతో స్థితిఅంతా చెప్పాడు మోహనరావు. ఇంతవరకు ఎన్నడూపడని బాధపడి ఆమె మెడలో ఒక పసుపుకొమ్ము కట్టుకొని ఆ మంగళసూత్రం మోహన్ రావు చేతులో పెట్టింది.

పదిమందిలో మంగళవాద్యా

లతో ఆమె కంఠమునకు కట్టిన ఆ చేతులతోనే ఆమంగళసూత్రాన్ని మార్వాడి అధీనం చేయవలసినంత నిర్భాగ్యుణ్ణి అయినాను కదా అని వలవలఏడ్చాడు మోహన్. కాని తనకు ఫస్టుక్లాసు పట్టావుందికదా ఈ ఉద్యోగానికి సెలెక్టుఅయితే రెండు మాసాల్లో ఆబంగారం తిరిగి తెచ్చుకోవచ్చునని అంతరాత్మను సమాధానంచేసుకొని అది తాకట్టుపెట్టి పదిరూపాయలు ప్రభుత్వపు ఖజానాలో చెల్లించాడు. ఆతడు బెమ్మిగాడవటంవల్లను, అందులోను తెలుగువాడు అవడంవల్లను- ఆఎడ్వర్టైజుమెంటులో అందరులైనుచేసిన అక్షరాల గూఢార్థం తెలుసుకోలేక పోవడంవల్లను మంగళసూత్రంకూడా నిరుపయోగంగానే మాయమైయింది.

దీనితో అతని హృదయం గాయపడింది.

పోనీ మానాభిమానాలు వదలి సినీమాలో దిగుదాం తన శీలం పోయినా కమలను సుఖపెడదామనుకున్నాడు. డైరెక్టరే నటిస్తున్న ఒక ఫిలింకంపెనీకి వెళ్ళాడు. ఆ ఫిలిం డైరక్టరు సెట్టుమీద ముద్దుపెట్టుకునైనా సంతోషిద్దామనుకునే రసపిచ్చగాడు. ఆయనకు ఆడ కేరెక్టరువేసేవాళ్ళేకాని మగవాళ్ళతో అవసరంలేదు, విధంచెడినా ఫలందక్కలేదు. ఆడైరక్టరు 'మీ ఆడవాళ్ళను తీసుకురా. బాగుంటే సినీమాలో జేరిపిస్తాం అంతేగాని మావద్ద చాలామంది మగవాళ్లు ఉన్నారు.మగవేషాలకు మాకు పై వాళ్ళు అవసరంలే'దన్నాడు.

ఈమాటలు వినేసరికి మోహనరావుకి అరికాలుమంట నెత్తికెక్కింది చటాలున వెళ్ళిపోయాడు. అక్కడి మగవారందరు వికవికనవ్వారు. అన్నానికి వేచివున్న కుక్కలు యివి అనుకున్నాడు మోహన్ వారిప్రవర్తనచూచి. ఎట్టి నీచకార్యానికి ఒడంబడినా దొరకడంలేదు. గత్యంతరం ఏమిటని రాత్రింబవలు తదేకదీక్షతో ఆలోచించాడు కండ్లు ఎర్రబడిపోయాయి. ఒకనాటిరాత్రి లేచి కూచున్నాడు. ఆలోచనలో ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. ఎదురుగుండా పిల్లవానిని ప్రక్కలో పడుకోబెట్టుకొని నిద్రపోతున్న కమల కనుపించింది.

తాను చనిపోతే ఆమె గతి ఏమిటా అని వితర్కించుకున్నాడు. పిల్లవాడు తండ్రిలేనివాడవుతాడు. ఆమెను విధవ అంటారు. ఆత్యాగశీలను. గుణవతిని అపవాదులకు లోను చేయడానికి అతనికి మనస్కరించలేదు.

ఆమరునాడు తనదీనస్థితి తన నిశ్చయం భార్యకు చూచాయిగా చెప్పాడు మోహన్. ధైర్యశాలిని పతివ్రతాశిరోమణి కమల అతనిని ఒక్కకోరికకోరింది. తనను పసుపుకుంకుమతో పరలోకమునకు పంపమని. ఆమెకోరిక వినేసరికి మోహనరావుకి మెరుపుదెబ్బ తగిలినట్టు అయింది. తాను బ్రతికి వుండి లాభంలేదని మానాభిమానాలతో దరిద్రదేవతను వదుల్చుకోలేమని అతనికి దృఢమయింది తాను చనిపోయి ఆమెను, ఆపాపను విచారసాగరంలో తోసివేసేయడం అతనికి నచ్చలేదు. కాగా దరిద్రదేవతకు వారిని బలిగా నిచ్చి తరువాత తాను నిరుద్యోగ పిశాచానికి ఫలహారంగా వినియోగపడాలనుకున్నాడు.

ఆవిషయమై నాలుగురోజులు వితర్కించుకొన్నాడు. తుట్టతుదకు ఒక శుక్రవారంనాడు రాత్రి ఆ పవిత్రాత్మలను దరిద్ర దేవతకు నైవేద్యం చేసాడు. తనుకూడా పొడుచుకుని మృత్యుదేవత ఒడిలో నిద్రపోదామనుకున్నాడు. హత్యకన్నా ఆత్మహత్య మహాపాపముని. పెట్టుపోతలకు ఒకవేళ లోపమున్నా పట్టి చంపుటలో ప్రభుత్వం వెనుతీయదని తెలుసును గనుక ఆత్మహత్య చేసుకోకండా వూరుకున్నాడు.

ఆమరునాడు ఉదయాన్నే హత్యానేరంమీద అతన్ని పట్టి బంధించారు.

ఒకనాడు అతన్ని అడుక్కుతినమని చెప్పిన న్యాయమూర్తులు ధర్మం పాలించడానికి ఉన్నతాసనాలు అలంకరించి వున్నారు.

'కోర్టులో తాను నిర్దోషినని తనదరిద్రమే ఆ నిండుప్రాణాలను బలిగొన్నదని వారిని పోషించడానికి తనకువున్న అధికారం వారిని చంపడానికికూడావుంది అని' చెప్పాడు మోహన్. కోర్టు కిటకిటలాడిపోతుంది. న్యాయమూర్తి ప్రభుత్వంపేరట ఎట్టి శిక్ష విధిస్తాడో తెలుసుకోడానికి అమాయక ప్రజలు ఆతురతపడుతున్నారు.

కాని ప్రభుత్వభారము నంతను ఆదిశేషునిలా తమనెత్తిని మోస్తూవున్న ధర్మాన్ని నాలుగుపాదాల నడిపిస్తూవున్న న్యాయమూర్తి కేసుఅంతా సావధానంగా విని గంభీరంగాలేచి యీకేసులో మోహన్ దోషిఅని భార్యను బిడ్డను పోషించడానికేగాని ఆమెను, ఆపాపను చంపడానికి అధికారంలేదని యిటు దారుణహత్య గావించినందుకు మోహన్‌ను ఉరితీయవలసిందని శాసించాడు.

'పోషించడానికేగాని చంపడానికి అధికారంలేదు సామాన్యునికి. పోషించలేదు కాని చంపగలదు ప్రభుత్వం. ఆహా ప్రకృతివైచిత్రం!' అనుకొంటూ త్యాగశీల అయిన అర్థాంగిని ఆలోకంలోనైనా కలుసుకోడానికి ఆత్మహత్యఅనే పాపం లేకండా మరణం సంభవించింది కదా అని చిద్విలాసంతో ఉరి కంబమెక్కాడు మోహన్.

---

## గతయుద్ధంలో

గత ఐరోపా మహాయుద్ధంలో, ఇరువాగులయందూ చనిపోయినవారి మొత్తపుసంఖ్య 1,20,00,000 (ఒక కోటి ఇరవైలక్షలమంది.)




టి. సి. యేన్.

ఆభరణాలంకారవుటందాన్ని తెలుపటానికి అద్దమేల ?
2 సంవత్సరములు గ్యారంటీ. కాంతిలోను, వన్నెలోను
బంగారున కేమాత్రము తీసిపోవు. నలుపెక్కవు.

| గుండీలు | | మెడచెయినులు | |
|---|---|---|---|
| 4 గుండీల సెట్టు 1-కి రు. | 1-4-0 | పెద్ద సైజు | |
| బటన్ చైన్ మాత్రము (గుండీలు లేక) | | 1 పేట 1-కి రూ. | 7-0-0 |
| | | 2 పేటలు ,, | 14-0-0 |
| 4 గుండీలది 1-కి రు. | 1-4-0 | 3 పేటలు ,, | 21-0-0 |
| 3 ,, ,, | 1-0-0 | 4 పేటలు ,, | 28-0-0 |
| 2 ,, ,, | 0-12-0 | చిన్న సైజు | |
| | | 1 పేట 1-కి రూ. | 5-0-0 |
| వి. పి. ఖర్చులు | 0-8-0 | 2 పేటలు ,, | 10-0-0 |



మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు 'ఆంధ్రభూమి' పేరు నుదహరించిన మాధరలమీద రూపాయకు ఒక అణా వంతున తగ్గించబడును.

టి. సి. నాగలింగప్ప అండు కంపెని,

280, వాల్‌టాక్సురోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

ఏజంట్సు:—గుప్తా అండ్ కో, మెయిన్‌రోడ్, కాకినాడ.